క్లుప్తంగా

సిటీ బస్సులో ప్రయాణించిన ఆర్‌ఎం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రయాణికుల సౌకర్యార్థం నగరంలో పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్‌కు నడుపుతున్న సిటీ బస్సులో శనివారం ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న ప్రయాణించారు. పాత బస్టాండ్ నుంచి సిటీ బస్సులో ప్రయాణించిన ఆర్‌ఎం బస్సులోని ప్రయాణికులతో మాట్లాడారు. ఈ మేరకు త్వరలోనే మరికొన్ని బస్సులను నడపనున్నట్లు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని వర్తక సంఘం కార్యాలయం వద్ద వేసవి తాపం తీర్చేందుకు ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన శనివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, పాయల నాగేశ్వరరావు కైలాసపు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డీసీహెచ్‌ఎస్ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు సతీమణి భూక్య విజయ పెద్దకర్మ శనివారం ఖమ్మం వీడీవోస్ కాలనీలో నిర్వహించగా పలువురు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ భద్రూనాయక్, వీరనారిమణుల ఆశయ సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షురాలు షేక్ నజీమా, అధ్యక్షురాలు భుక్య ఉపేంద్రబాయి, నాయకులు రాజేష్‌నాయక్, కృష్ణనాయక్, రవీందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ తొలగించాలని బెదిరింపు..

రఘునాథపాలెం: గత ఇరవై ఏళ్లుగా మండలంలోని రజబ్‌అలీనగర్‌లో సాగు చేసుకుంటూ తమ పేరుతో పట్టా ఉన్న ఎనిమిది ఎకరాల భూమికి ఇటీవల తాము ఫెన్సింగ్ వేయించుకుంటే కొంతమంది ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి తొలగించాలని బెదిరిస్తున్నారని బానోత్ లీలాబాయి రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తె లావణ్య పేరుతో పట్టా ఉన్న భూమిలోకి శ్రీను, శరత్, తదితరులు బెదిరిస్తూ.. భూమి లేదా రూ.20 లక్షలు ఇవ్వాలని లేకుంటే చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించింది. తమకు న్యాయం చేయాలంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ శ్రీహరి విచారణ చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

'ఉపాధి' కూలీలకు తప్పిన ప్రమాదం

నేలకొండపల్లి: ఉపాధి హామీ పథకం కూలీలకు త్రుటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని చెరువుమాధారంలో పలువురు కూలీలు శనివారం ఉపాధి హామీ పనులు చేస్తుండగా.. తాచు పాము కనిపించింది. అక్కడ వృద్ధులు, మహిళలు ఉండడంతో ఆందోళనకు గురికాగా.. కొందరు యువకులు దాన్ని చంపేశారు. ఈ విషయాన్ని ఉద్యోగులకు తెలియచేయడంతో కూలీలను మరో చోటుకు పంపించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని అగ్రహారం కాలనీలో ఒక వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో శనివారం ఖమ్మంఅర్బన్ స్టేషన్‌లో ముగ్గురుపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. అగ్రహారం కాలనీకి చెందిన బండారు ఏడుకొండలు ఇంటి వద్దకు శుక్రవారం రాత్రి పి.వెంకన్న మద్యం తాగి వచ్చి దుర్భాషలాడుతూ ఘర్షణకు దిగాడు. మద్యం మత్తులో ఉన్నావని, ఇక్కడి నుంచి వెళ్లాలంటూ స్థానికులు వారించారు. అయినా వినకుండా అతడి భార్య, కుమార్తెకు ఫోన్‌చేసి అక్కడకు రావాలని చెప్పడంతో, వారూ అక్కడికు చేరుకొని వారు సైతం బూతులు తిడుతూ ఘర్షణకు దిగారు. ఇంటిపై రాళ్లు వేసేందుకు ప్రయత్నించగా.. అక్కడున్న మధు అనే వ్యక్తి వారిని వారించేందుకు అడ్డువెళ్లాడు. దీంతో అతడిపై దాడి చేయగా తల, ఛాతి, ఒంటిపై గాయాలయ్యాయి. ఈమేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం

కామేపల్లి: యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి పీవైఎల్ సంఘం నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాటోత్ ప్రేమ్‌సింగ్, ఎస్‌వీ రాకేష్ అన్నారు. శనివారం మండలంలోని ముచ్చర్లలో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల కాలంలో యువత, విద్యార్థులకు మౌలిక సమస్యలు పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ విఫలమైందని, గడిచిన ఎన్నికల్లో యువతే ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలతో కాలం గడపకుండా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ నెల 6న ముచ్చర్లలో సంఘం ఆధ్వర్యాన జిల్లా రాజకీయ శిక్షణలు, జనరల్ కౌన్సిల్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మంద సురేష్, భరత్, నాయకులు ధరణి కృష్ణ, రవీందర్, కనకరాజు, శివలాల్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలను శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పఠించారు. తమలపాకులతో ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు హనుమాన్ జయంతి విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలుచోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షినెట్‌వర్క్

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


ఖమ్మంఅర్బన్: చైతన్యనగర్‌లో ఆంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు


ఖమ్మంగాంధీచౌక్: తమల పత్రాలతో హనుమంతుడికి ప్రత్యేక పూజలు


కూసుమంచి: జీళ్లచెరువులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


రఘునాథపాలెం: కోయచలకలో అభిషేకం, వ్రత పూజలు చేస్తున్న భక్తులు


కామేపల్లి: రామకృష్ణాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో చాలీసా పారాయణం


కూసుమంచి: పాలేరులో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం


తిరుమలాయపాలెం: సోలీపురంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో..


ఖమ్మంమయూరిసెంటర్: 41వ డివిజన్‌లో శ్రీదాసాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం


నేలకొండపల్లి: బైరాగి గుట్ట వద్ద ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం


ఖమ్మంరూరల్: నాయుడుపేటలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

మండల కేంద్రానికి పాఠ్యపుస్తకాలు..

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రానికి మండలంలోని 60 పాఠశాలల్లోని దాదాపు 3,400 మంది విద్యార్థులకు గాను 16,500 పాఠ్యపుస్తకాలు, 12,500 నోట్ పుస్తకాలు మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఈ నెల 3 నుంచి జరిగే బడిబాట కార్యక్రమంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పాఠ్య పుస్తకాలను మండల విద్యాశాఖాధికారి బి.రాములు సమక్షంలో విద్యా వనరుల కేంద్రంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి నివేదికలపై సర్వే

నేలకొండపల్లి: గత ప్రభుత్వం హయాంలో పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనులపై నివేదికను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో శనివారం పంచాయతీల వారీగా ఎంపీడీఓ ఎం.యర్రయ్య సమగ్రంగా సర్వే చేపట్టారు. గ్రామాల్లో 2022–23లో అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, రహదారులు, మంచినీరు, మురుగునీరు కాలువలు, ఆరోగ్య ఉప కేంద్రాల పనితీరు తదితరాలపై నివేదిక తయారు చేస్తున్నారు. అంతేకాక 2024–25లో చేపట్టనున్న అభివృద్ధి పనుల కార్యచరణకు ప్రభుత్వం నివేదిక కోరినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, పంచాయతీ కార్యదర్శులు బైరం దినేష్‌కుమార్, బోళ్ల వీరబాబు, శ్రీనివాసరావు, మహేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'నిమ్స్' తరహాలో ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: వైద్యం కోసం మూడు రాష్ట్రాల నుండి వేలాది మంది ఖమ్మంకు వస్తున్న నేపథ్యాన హైదరాబాద్ నిమ్స్ తరహాలో ఇక్కడ నూతన ఆస్పత్రి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. సీపీఎం, బీవీకే ఆధ్వర్యాన ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల పోస్టులన్నీ భర్తీ చేయడమే కాక గుండె సంబంధింత చికిత్స నిపుణులను కూడా నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అవగాహన సమావేశాలు నిర్వహించాలనికోరారు. వైద్యులు సి.భారవి, పిల్లలమర్రి సుబ్బారావు, రావిళ్ల రంజిత్, రాజేష్, జెట్ల రంగారావు తదితరులు పరీక్షలుచేయగా, ఎస్‌ఆర్‌ఐ బాబు, సీపీఎం నాయకులు వై.విక్రమ్, వై శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, శివనారాయణ, పి ఝాన్సీ, రమేష్, వాసిరెడ్డి వీరభద్రం, భద్రం, జె వెంకన్న బాబు, పి.వాసు, అఫ్జల్, పి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, పుస్తకాలు అమ్మకుండా చూడాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో యూనిఫాం, షూస్, బెల్ట్‌లు, పుస్తకాలు అమ్మకుండా పర్యవేక్షించాలని, ఎక్కడైనా అమ్మితే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ విద్యాశాఖ అధికారులు జారీ చేసిన జీఓ మాదిరి ఖమ్మం జిల్లాలోనూ తీసుకురావాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు శనివారం డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు స్కూళ్లలో ఫీజులు 30 శాతం నుంచి 50 శాతం వరకు ఫీజు పెంచుతున్నా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా యాజమాన్యాలను నియంత్రించని పక్షంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకుడు స్టాలిన్, పృథ్వీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో తప్పులు సహించం..

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో తప్పులు చేస్తే సహించేది లేదని డీఆర్‌డీఓ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శిరీష హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం 15వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. తొలుత గ్రామపంచాయతీల వారీగా చేసిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈమేరకు ఆడిట్ సిబ్బంది అందించిన నివేదికను చదివి వినిపించారు. ఈసందర్భంగా పలు పంచాయతీలలో మస్టర్లు వేయడంలో తప్పులను గుర్తించారు. వీటన్నింటిని సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీదేవి, అంబుడ్స్‌మెన్ రమేష్ మోహన్, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, టెక్నికల్ అసిస్టెంట్లు యాకయ్య, నాగేందర్, పంచాయతీ కార్యదర్శులు బైరం దినేష్‌కుమార్, బోళ్ల వీరబాబు, దేవేందర్, శ్రీనివాసరావు, మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు తిగుళ్ల భాస్కర్, ఉపేందర్, బీమాల కిషోర్, ఆదెమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు 130 గోవులు..

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి జీపీ పరిధిలో గల శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారంతపు సంత షెడ్‌లో ఉంచిన 130 గోవులను తిరుమలాయపాలెం పోలీసుల ఆధ్వర్యాన శనివారం డీసీఎం ద్వారా పాల్వంచలోని ఓ గోశాలకు తరలించారు. వీటిలో సుమారుగా 4 గోవులు మృతి చెందినవి.

32 గేదె దూడలు పట్టివేత..

జగ్గారెడ్డిగూడంలో 32 గేదె దూడలను ఓ వ్యాపారి కొనుగోలు చేసి డీసీఎంలో హైదరాబాద్ తరలిస్తుండగా.. తిరుమలయపాలెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాటిని మండలంలోని కొమ్మినేపల్లి జీపీ పరిధిగల శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారంతపు సంత షెడ్‌కు తరలించారు. అనంతరం సరైన అనుమతి పత్రాలు ఉండడంలో వదిలిపెట్టారు.

ఉవ్వెత్తున ఉద్యమం..

- న్యాయవాద జేఏసీ ఆధ్వర్యాన తెలంగాణ పోరాటం
- ప్రతీ రోజు జయజయహే తెలంగాణ గీతాలాపన

ఖమ్మంలీగల్: తెలంగాణ సాధన కోసం సబ్బండ వర్గాలు ఏకమై ఉద్యమించాయి. ఉద్యమ సమయాన అప్పటి టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించినప్పటి నుంచి జిల్లాల్లో ఉద్యమ చైతన్యం వెల్లివిరిసింది. ఈ ఉద్యమంలో అన్నివర్గాలతో పాటే న్యాయవాదులు సైతం ప్రముఖ పాత్ర పోషించారు. ప్రజల్లో చైతన్యం రగిలించేందుకు 'జయ జయహే తెలంగాణ'గేయాన్ని కోర్టులో కొద్ది మందితో ప్రారంభించి, వందల మందితో ప్రార్థనాగీతంగా ఆలపించడంతో న్యాయశాఖ ఉద్యోగులు, కక్షిదారుల్లో తెలంగాణ సాధించాలనే కాంక్ష పెరిగింది. పలుమార్లు ఖమ్మం న్యాయస్థానానికి వచ్చిన కోదండరాం, విమలక్క, గద్దర్, బోయినపల్లి వినోద్‌కుమార్,, ఈటల రాజేందర్, కవిత, హరీశ్‌రావు, కేటీఆర్, మంద కృష్ణ తదితర నేతలే కాక కవులు, కళాకారులు గేయాలాపన పాల్గొన్నారు. ఇక 2010లో బిచ్చాల తిరుమలరావు నాయకత్వాన జేఏసీ ఏర్పడగా, 2011 సకల జనుల సమ్మె సమయాన దేశపతి శ్రీనివాస్‌ను తీసుకొచ్చి న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు, క్లర్కులు, కక్షిదారుల ఆధ్వర్యాన భారీ సభ నిర్వహించారు. అలాగే, 42 రోజులపాటు న్యాయస్థానాలను బంద్ చేసి సకలజనుల సమ్మెలో పాల్గొన్న న్యాయవాదులు, పార్లమెంట్ ముట్టడికి సైతం వెళ్లి లాఠీ దెబ్బలు తిని కేసులను ఎదుర్కొన్నారు.


తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద న్యాయవాదులు (ఫైల్)

సాంస్కృతిక ఉద్యమం..

తెలంగాణ సాధన కోసం న్యాయవాదులు సాంస్కృతిక ఉద్యమాన్ని చేశారు. రసమయి బాలకిషన్, మధుప్రియ, జయరాజు తదితరుల ఆధ్వర్యాన అనేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం రగిలించారు. కేసులు, అరెస్టులకు భయపడకుండా న్యాయవాదులు రైలు రోకోల్లోనూ పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో తెలంగాణ వ్యతిరేక వర్గాల అణచివేతను ఎదుర్కొని ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఘనత న్యాయవాదులు, న్యాయవాద జేఏసీకి దక్కుతుందని చెబుతారు. ఇందులో జేఏసీ చైర్మన్ బిచ్చాల తిరుమలరావుతో పాటు గోవర్ధన్‌రెడ్డి, వెంకటరమణ, వేపచేదు మధు, కొండపల్లి జగన్, కర్లపూడి శ్రీనివాస్, రానేరు కిరణ్, శ్రీనివాస్, గుప్తా, దానయ్య, లక్ష్మీనారాయణ తదితరులు కీలకంగా వ్యవహరించారని గుర్తుచేసుకుంటారు.

విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి

తిరుమలాయపాలెం: దళిత గిరిజనులకు 50 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు, మినీ ట్రాక్టర్లను సబ్సిడీతో ఇవ్వాలని ఏఐపీకేఎస్ తెలంగాణ రాష్ట్ర నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. శనివారం మండల డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకం ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, వరి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు తిమ్మిడి హనుమంతరావు, ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు బానోతు శంకర్, చింతలపూడి శ్రీనివాస్‌రావు, తాత హనుమంతరావు, మండల వెంకటేశ్వర్లు, దొడ్డ వెంకన్న, అంగిరేకుల పిచ్చయ్య, పోతుగంటి సతీష్, తోకల సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించడం సంతోషకరం

నేలకొండపల్లి: తెలంగాణ ఉద్యమకారులను బీఆర్‌ఎస్ పార్టీ గుర్తించడం సంతోషకరమని ఆ పార్టీ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు తెల్లగొర్ల లింగస్వామి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన ఉద్యమకారులకు ఘన సన్మానం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి, సొసైటీ చైర్మన్ సైదారెడ్డి, పార్టీ నాయకులు నంబూరి సత్యనారాయణ, మరికంటి రేణుబాబు, మాదాసు ఆదాం, అమరగాని యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

రాష్ట్ర సాధనలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ సైదారెడ్డి, ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి, ఉద్యమకారులు పాల్గొన్నారు.